# బస్సులు రాలె.. ఆటోలు నడువలె



తిమ్మాపూర్ : ట్రాక్టర్‌లో వెళ్తున్న విద్యార్థులు

### ట్రాక్టర్‌లో ఇండ్లకు వెళ్లిన విద్యార్థులు

తిమ్మాపూర్, డిసెంబర్ 7 : ఆటోలు బంద్ కావడం.. బస్సులు టైంకు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తిమ్మాపూర్ మోడల్ స్కూల్, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు శనివారం సాయంత్రం ఇండ్లకు వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. రాజీవ్ రహదారిపై ఏ వాహనం దొరికితే వస్తే అది ఎక్కి వెళ్లారు. పలువురు విద్యార్థులను తల్లిదండ్రులు తీసుకెళ్లగా.. మరికొందరు ట్రాక్టర్లలో వెళ్లారు. ఇంకొందరు నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది.



# పెండింగ్ బిల్లులు ఇప్పించండి

- సర్కారుపై ఒత్తిడి తీసుకురండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మాజీ సర్పంచుల విజ్ఞప్తి



హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న మాజీ సర్పంచులు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ) : ఏడాది గడుస్తున్నా కాంగ్రెస్ సర్కారు పెండింగ్ బిల్లులు ఇవ్వడం లేదని, సర్కారుపై ఒత్తిడి తీసుకువచ్చి ఇప్పించేలా చూడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సిరిసిల్ల జిల్లాకు చెందిన మాజీ సర్పంచులు మొరపెట్టుకున్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సర్పంచుల ఫోరం జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపెల్లి కరుణాకర్ ఆధ్వర్యంలో 50 మంది ఆయనకు వినతిపత్రం అందజేశారు. గ్రామాల అభివృద్ధి కోసం చేసిన పనులు, వివరాలు తెలుపుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు ఇప్పించాలని కోరగా, కేటీఆర్ సానుకూలంగా స్పందించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఏడాదిగా ప్రభుత్వానికి పదేపదే విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని, అనేక పోరాటాలు చేసినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దురదృష్టకరమని వాపోయారు. సకాలంలో బిల్లులు రాక చాలా మంది తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని, అప్పుల బాధ తాళలేక కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి వెంట ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, సలహాదారులు చాకలి రమేశ్, బొజ్జం మల్లేశం, గంగాధర్, మల్యాల దేవయ్య, గున్నాల లక్ష్మణ్, కోల నర్సయ్య, ఆరె మహేందర్, గాండ్ల సుమతి, తాడెపు ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల వేళల్లో పంతుళ్ల ప్రచారం?

- రిటర్నింగ్ ఆఫీసర్‌కు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- కఠిన చర్యలకు కలెక్టర్ ఆదేశాలు
- నిబంధనలకు విరుద్ధంగా జరిగే ప్రచారాలపై నిఘా
- రేపటితో ముగియనున్న ఓటు నమోదు
- శనివారం వరకు కొత్తగా 26 వేల దరఖాస్తులు
- మరింత పెరిగే అవకాశం

## ఎమ్మెల్సీ కాన్వాసింగ్‌లో పలువురు ప్రభుత్వోపాధ్యాయులు!




కరీంనగర్– మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు పోటీపడే ఔత్సాహికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. వచ్చే మార్చిలో ఎన్నికలు జరుగనుండగా.. ఇప్పటికే ప్రచారం జోరందుకున్నది. రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఎవరికి వారే తమకే మొదటి ప్రాధాన్యత ఓటువేయాలంటూ ప్రచారం చేస్తున్నారు. అయితే పలువురు ప్రభుత్వోపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగా ప్రచారంలో పాల్గొంటున్నట్టు కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతుండగా, రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా.. ముఖ్యంగా పాఠశాలల వేళల్లో టీచర్లెవరైనా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ తాజాగా నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ప్రచారాలను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమాచారం సేకరిస్తుండగా.. తాజా ఆదేశాలు ఉపాధ్యాయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి.

కరీంనగర్, డిసెంబర్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్– మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల పదవీకాలం వచ్చే యేడాది మార్చితో ముగుస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసిన ఎన్నికల సంఘం, ఓటరు నమోదు కార్యక్రమం కొనసాగిస్తున్నది. ఇప్పటికే ముసాయిదా జాబితాను విడుదల చేసిన ఈసీ, రెండో దఫా ఓటరు నమోదుకు ఈ నెల 9వ తేదీ వరకు అవకాశమిచ్చింది. భవిష్యత్‌లో మరోసారి నమోదుకు అవకాశం ఉంటుందన్న ప్రచారం సాగుతున్నా అధికారికంగా మాత్రం స్పష్టత లేదు. కాగా, ఇప్పటివరకు విడుదలైన ముసాయిదా జాబితా ప్రకారం చూస్తే.. పట్టభద్రుల ఎమ్మెల్సీకి 3,14,531 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 23,602 మంది ఓటరుగా నమోదు చేసుకున్నారు. దాదాపు 40వేలపైగా దరఖాస్తుల తిరస్కరణ తర్వాత ఈ ఓటర్లు మిగిలారు. రెండో విడుత ఓటు నమోదు రేపటితో ముగియనుండగా, శనివారం వరకు ఉన్న సమాచారం మేరకు.. గతంలో విడుదల చేసిన ముసాయిదా జాబితాకు అదనంగా గ్రాడ్యుయేట్‌కు 23వేలు, ఉపాధ్యాయులకు మరో 3 వేల దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తున్నది. గతంతో పోలిస్తే రెండు ఎమ్మెల్సీలకు ఈ సారి ఓటర్ల సంఖ్య పెరిగింది. ఇదే సమయంలో పోటీచేసే ఔత్సాహిక నాయకుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది.

**ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం గ్రాడ్యుయేట్స్ ఓటర్స్ వివరాలు**

| జిల్లా | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 3709 | 1524 | 5233 |
| మంచిర్యాల | 17414 | 10699 | 28113 |
| ఆదిలాబాద్ | 9308 | 4097 | 13405 |
| నిర్మల్ | 10689 | 5258 | 15947 |
| నిజామాబాద్ | 17237 | 9873 | 27110 |
| కామారెడ్డి | 9961 | 4032 | 13993 |
| జగిత్యాల | 19659 | 12163 | 31822 |
| పెద్దపల్లి | 16771 | 10558 | 27330 |
| కరీంనగర్ | 38720 | 25934 | 64654 |
| రాజన్న సిరిసిల్ల | 12554 | 7720 | 20274 |
| సంగారెడ్డి | 13670 | 6331 | 20001 |
| మెదక్ | 7945 | 3086 | 11031 |
| సిద్దిపేట | 19618 | 9826 | 29444 |
| హన్మకొండ | 2757 | 1221 | 3978 |
| భూపాలపల్లి | 1541 | 655 | 2196 |
| **మొత్తం** | **2,01,553** | **1,12,977** | **3,14,531** |

రెండో దఫా ఓటరు నమోదుకు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో శనివారం వరకు గ్రాడ్యుయేట్స్‌కు వచ్చిన దరఖాస్తుల సంఖ్య : 23వేలు

**ఇటీవల విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం టీచర్స్ ఓటర్స్ వివరాలు**

| జిల్లా | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|
| ఆసిఫాబాద్ | 283 | 131 | 419 |
| మంచిర్యాల | 863 | 542 | 1,405 |
| ఆదిలాబాద్ | 975 | 426 | 1,401 |
| నిర్మల్ | 1,147 | 539 | 1,686 |
| నిజామాబాద్ | 1,947 | 1,252 | 3,199 |
| కామారెడ్డి | 1,280 | 695 | 1,975 |
| జగిత్యాల | 1,146 | 449 | 1,595 |
| పెద్దపల్లి | 447 | 310 | 757 |
| కరీంనగర్ | 2,288 | 1,340 | 3,628 |
| రాజన్న సిరిసిల్ల | 587 | 231 | 818 |
| సంగారెడ్డి | 1,421 | 1,075 | 2,496 |
| మెదక్ | 709 | 393 | 1,102 |
| సిద్దిపేట | 1,839 | 1,062 | 2,901 |
| హన్మకొండ | 107 | 33 | 140 |
| భూపాలపల్లి | 62 | 18 | 80 |
| **మొత్తం** | **15,106** | **8,496** | **23,602** |

రెండో దఫా ఓటర్ నమోదుకు అవకాశం ఇచ్చిన నేపథ్యంలో శనివారం వరకు టీచర్లకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య : 3వేలు

### ఉపాధ్యాయుల ప్రచారం!

పోటీదారులు తమ ప్రచారం కోసం ప్రభుత్వోధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులపై దృష్టి పెట్టినట్టు తెలుస్తున్నది. దీనికి ప్రత్యేక కారణం కూడా కనిపిస్తున్నది. ప్రస్తుతం ఓటరుగా నమోదు చేసుకున్న పంతుళ్లకు ఇటు పట్టభద్రులు, అటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఓటువేసే అవకాశముంటుంది. ఈ రెండు విషయాలను పరిగణలోకి తీసుకున్న పోటీదారులు.. చాలామంది టీచర్లను తమ ప్రచారానికి వాడుకుంటున్నారు. ఒక్కో నాయకుడు ఒక్కో రేటు చొప్పున ఇస్తున్నట్టు తెలుస్తుండగా, పలువురు ఉపాధ్యాయులు, సంఘనాయకులు పాఠశాల వేళల్లోనే ప్రచారానికి వెళ్తున్నారు. కొందరు బడికి ఎగనామం పెట్టి ప్రచారానికి వెళ్తుంటే.. మరికొందరు మాత్రం పోటీదారులను ఏకంగా బడికి పిలిచి, తోటి టీచర్లను పరిచయం చేస్తూ బడి వేళల్లోనే ప్రచారం చేసేలా తమ వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. అక్కడితో ఆగకుండా, కొంత మంది తమ తోటి పంతుళ్లను కలుపుకొని ప్రచారం చేస్తూ.. డేలోనూ దావత్‌లు పెట్టిస్తున్నారు. కొందరు టీచర్లు ప్రత్యేకంగా ఇదే పనిలో నిమగ్నమవుతున్నారనే విమర్శలు కొన్నాళ్లుగా వస్తూనే ఉన్నాయి. పలు చోట్ల ఇదే విషయమై ప్రధానోపాధ్యాయులు ప్రశ్నిస్తే.. సదరు హెచ్‌ఎంలనే ప్రచారానికి వెళ్తున్నరాని ఉపాధ్యాయులు బెదిరిస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో తమ కెందుకులే అన్నట్టు హెచ్‌ఎంలు వ్యవహరిస్తుండగా, బోధనకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే పలువురు టీచర్లు చేస్తున్న ప్రచారంపై రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

### కఠిన చర్యలకు ఆదేశాలు

నిబంధనలకు విరుద్ధంగా, అందులోనూ స్కూల్ వేళల్లో కొంత మంది టీచర్లు చేస్తున్న ప్రచారానికి సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల విద్యాధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించి ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. స్కూల్ అవర్స్‌లో ఎలాంటి కాన్వాసింగ్ చేయరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇటువంటి ప్రచారాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. రిటర్నింగ్ అధికారి జారీ చేసిన సర్క్యులర్ ఆయా జిల్లాల డీఈవోల నుంచి ఎంఈవోలకు, అక్కడి నుంచి హెచ్‌ఎంలకు చేరింది. ప్రస్తుతం ఇది ఉపాధ్యాయ వర్గాల్లో హాట్‌టాపిక్‌లా మారింది. అయినా కొంత మంది టీచర్లలో ఇంకా మార్పు రావడం లేదని తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రచారాలను నిశితంగా పరిశీలించేందుకు రిటర్నింగ్ అధికారి ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు సమాచారం. నిజానికి ఎమ్మెల్సీ ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యాసంస్థలు, అలాగే జూనియర్, డిగ్రీ కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలు, ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలు, అగ్రికల్చర్, వెటర్నటీ, నర్సింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న టీచింగ్ స్టాఫ్ ఓటర్లే అయినందున ఆయా సంస్థల్లో నేరుగా ప్రచారం చేయరాదు. అదేవిధంగా ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రత్యక్షంగా ప్రచారం చేయడానికి అవకాశం లేదు. పాఠశాల, కళాశాల ఆవరణల్లో ఎలాంటి ప్రచార పోస్టర్లను కూడా అంటించరాదు. అందుకు భిన్నంగా ప్రవర్తించిన వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకునే అధికారం ఉన్నది. కాగా, ఔత్సాహిక పోటీదారుల సంఖ్య క్రమేపీ పెరుగుతున్న నేపథ్యంలో ఫిర్యాదుల పరంపర ముున్ముందు మరింత పెరిగే అవకాశం కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో అధికారయంత్రాగం సైతం ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నది.



గంభీరావుపేట: మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న ఆటో యజమానులు, డ్రైవర్లు

# రోడ్డెక్కిన ఆటోడ్రైవర్లు

### ఆటోల బంద్ విజయవంతం

కరీంనగర్ తెలంగాణచౌక్, డిసెంబర్ 7 : ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ ఆటో యూనియన్ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం ఆటోల బంద్ విజయవంతమైంది. కరీంనగర్‌లో ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. బంద్ విఫలం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు పన్నిందని తెలంగాణ ఆటో ట్రాన్స్‌పోర్టు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు మద్దెల రాజేందర్ ఈ సందర్భంగా మండిపడ్డారు. ఆటో యూనియన్ నాయకులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. జూలపల్లి మండలంలో 500 ఆటోలను డ్రైవర్లు ఎక్కడికక్కడ నిలిపి వేశారు. సుల్తానాబాద్‌లో 400 మంది ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు ర్యాలీ తీసి, స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆటో కార్మికులందరూ ఆటోలను బంద్ చేసి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. గంభీరావుపేట మండలంలో ఆటో కార్మికులు బంద్ పాటించారు. స్థానిక తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద తమ ఆటోలతో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. తర్వాత పెద్దమ్మ స్టేజీ వద్దకు ర్యాలీగా తరలి వెళ్లి సిరిసిల్ల –కామారెడ్డి ప్రధాన రోడ్డుపై వంటావార్పు నిర్వహించారు. ఆటో యజమానులు, డ్రైవర్లు రోడ్డుపై భోజనం చేస్తూ తమ నిరసన తెలిపారు. కోనరావుపేటలో ఆటో కార్మికులు తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అంద జేసి, ధర్నా నిర్వహించారు. ముస్తాబాద్‌లో బంద్ పాటించారు.

# షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఆగ్రహం



### వెలమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు

కరీంనగర్: టూ టౌన్ సీఐకి ఫిర్యాదు చేస్తున్న పద్మనాయక వెలమ సంఘం నాయకులు

కరీంనగర్ తెలంగాణచౌక్, డిసెంబర్ 7 : షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్‌పై వెలమ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు తెలిపారు. ఆయనపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌లోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించిన అనంతరం పద్మనాయక వెలమ సంఘం జిల్లా అధ్యక్షుడు జువ్వాడి వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి చీటి ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో అక్కడి నుంచి టూటౌన్ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి, ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల మత, ఈర్ష్యా ద్వేషాలకు అతీతంగా ఉంటానని రాజ్యాంగబద్ధంగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే శంకర్ ఒక కులాన్ని అసభ్య పదజాలంతో దూషించడం సముచితం కాదని హితవుపలికారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ స్పందించి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్ వెలమ సంఘం సభ్యులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో షాద్‌నగర్ ఎమ్మెల్యే ఫ్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం పట్టణ సీఐ తిరుమల్ గౌడ్, హుజూరాబాద్ తహసీల్దార్ కనకయ్యకు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో మున్సిపల్ చైర్మన్, వెలమ సంఘం అధ్యక్షుడు తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, సంఘం నాయకులు షాద్‌నగర్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి జిల్లా వెలమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు పెద్దపల్లి ఏసీపీ గజ్జికృష్ణను కలిసి ఫిర్యాదు చేసి, ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని, వెలమలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పద్మనాయక వెల్మ సంక్షేమ సంఘం చందుర్తి మండల శాఖ ప్రతినిధులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# ధాన్యం వర్షార్పణం

- ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా వర్షం
- పెద్దపల్లిలో రైతుకు తీరని నష్టం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిముద్దయిన వడ్లు
- సెంటర్‌కు తెచ్చి వారం పదిరోజులైనా కొనకపోవడంతోనే ఈ దుస్థితి
- రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ సల్ప ప్రభావం



పెద్దపల్లి మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యం



కొట్టుకుపోతున్న ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు

పెద్దపల్లి, డిసెంబర్ 7(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ నిర్లక్ష్యం రైతన్నకు శాపంగా మారింది. కొనుగోళ్లలో నిర్లక్ష్యం అపార నష్టాన్ని తెచ్చిపెట్టింది. శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రధానంగా పెద్దపల్లి జిల్లాలో పడిన అకాల వర్షం రైతన్నను నిండా ముంచింది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి రోజులు గడుస్తున్నా సర్కారు కొనకపోవడంతో తడిసి ముద్దయింది. శనివారం వరకు దాదాపుగా 25వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం ఇంకా కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లోనే ఉండగా, వర్షానికి తడిసి పోయింది. అత్యధికంగా పెద్దపల్లి, ఓదెల, సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, రామగిరి, కమాన్‌పూర్, జూలపల్లి మండలాల్లో నష్టం వాటిల్లింది. ధాన్యం కొట్టుకుపోగా, రైతులకు దుఃఖమే మిగిలింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలుచోట్ల వాన కురిసింది. బోయినపల్లి మార్కెట్ యార్డుతోపాటు మరికొన్ని గ్రామాల్లోని కేంద్రాల్లో ధాన్యం నీటిపాలైంది. వేములవాడలో గంటకుపైగా ఎడతెరిపి లేకుండా పడిన వర్షంతో రాజన్న ఆలయం ఎదుట రహదారి వరదతో నిండిపోయింది.

### మూడు రోజుల నుంచి తడుస్తున్నయి



నేను పెద్దపల్లి మార్కెట్ల వడ్లు ఓసుకొని ఐదు రోజులైతంది. మాయిశ్చర్ వచ్చినా కొనలేదు. మూడు రోజుల నుంచి వానకు వడ్లు తడుస్తున్నయి. ఇయ్యాల బాగా తడిసినయి. ఇప్పటి వరకు ఎవరూ రాలేదు. చాలా మంది వడ్లు ఇక్కడ కొట్టుకు పోయినయి. అధికారులు, నాయకులు పట్టిచ్చుకోవాలె. మమ్ముల ఆదుకోవాలే.

**-అక్కపాక సదయ్య, పెద్దమ్మనగర్ (పెద్దపల్లి)**




ఉద్యోగ మేళా ప్రారంభిస్తున్న విశ్రాంత ఐపీఎస్ చిరంజీవులు

# శాతవాహనలో మెగా జాబ్ మేళా

### 50 సంస్థల్లో 2649 మంది రిజిస్ట్రేషన్

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 7 : శాతవాహన విశ్వవిద్యాలయం, హెచ్‌ఆర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌యూలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించగా, అనూహ్య స్పందన లభించింది. ముఖ్య అతిథులుగా విశ్రాంత ఐపీఎస్ చిరంజీవులు, అధ్యక్షులుగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్ హాజరై ప్రారంభించారు. మేళాలో 2649 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 427 మందికి అక్కడికక్కడే ఆఫర్ లెటర్లు అందజేశారు. అలాగే, మరో 845 మంది అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక్కడ ఎస్‌యూ రిజిస్టర్ ప్రొఫెసర్ ఎం వరప్రసాద్, ప్లేస్మెంట్ డైరెక్టర్ డాక్టర్ మనోహర్, 50 సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తండ్రీ కూతురికి ఒకేసారి 'లా' పట్టా



తండ్రీకూతురు ఎలిగేటి శ్రీనివాస్, కావ్య

మెట్‌పల్లి, డిసెంబర్ 7 : జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఎలిగేటి శ్రీనివాస్, ఆయన కూతురు కావ్య ఇద్దరు ఒకేసారి ఎల్ఎల్‌బీ కోర్సు పూర్తి చేశారు. అంతే కాకుండా, తెలంగాణ బార్ కౌన్సిల్‌లో ఇద్దరు ఒకే రోజు శనివారం ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. 50 ఏళ్ల వయసున్న శ్రీనివాస్ మెట్‌పల్లి పట్టణంలో ఫ్లెక్సీ షాప్ నిర్వహిస్తూనే శాతవాహన యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పట్టా తీసుకున్నారు. ఆయన కూతురు కావ్య న్యూఢిల్లీలోని సెంట్రల్ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందింది. కాగా, ఒకే సారి తండ్రీకూతురు న్యాయవాదులు కావడంతో పలువురు అభినందించారు.